# మనసా! నీ చిరునామా ఏది?

(సుమారు పంతొమ్మిది సం॥ కిందట బొంబాయిలోని ఒక తెలుగు ఆసోసియేషన్ వారి సావనీర్లో ప్రచురింప బడినకథ)

"డాడీ....డాడీ....."

"ఏవిట్రా?"

"మమ్మల్ని ఎక్స్‌కర్షన్‌కి తీసికెళ్తార్ట డాడీ... నేనూ వెళ్తాను డాడీ!"

"అలాగే వెళ్ళువుగాని...." వెంటనే పర్మిషన్ ఇచ్చేశాడు రామారావు.

"దాని కొసం డబ్బు కట్టాలిట... రానూపోనూ మాకోసం బస్సు ఏర్పాటు చేస్తారుట...." అక్కడే ఓపక్కగా కూర్చుని బియ్యం ఏరుతున్న సవితితల్లి వంక ఓరగా... భయం భయంగా చూశాడు గోపి. తనకోసం డబ్బు ఖర్చుపెడితే పిన్నికి బోలెడు కోపంవొచ్చేస్తుందని గోపికి తెలుసు అందుకే అభయం.

"అలాగేలే... ఎంత కట్టాలో ఏవిటో రేపు కనుక్కో కడదాం" ఒళ్ళు మండుకొచ్చింది కమలకి ఆసమాధానం వినగానే. అసలే... కాన్వెంట్ స్కూల్లో చదివిస్తే డబ్బు ఖర్చు ఎక్కువవుతుందని... గోపీని ఆ స్కూల్లో చేర్చేటప్పుడు చాలా గొడవ చేసింది.

అయినా కూడా... కొడుకుమీది ప్రేమతో... వాడిని కాస్త మంచి కాన్వెంట్ స్కూల్లోనే చదివిస్తున్నాడు రామారావు డబ్బు కట్టడానికి తండ్రి ఒప్పుకోవడంతో సంతోషంతో ఎగిరిగంతులేస్తూ... ఆడుకునేందుకు వీధిలోకి పరిగెత్తాడు గోపి.

* * *

“ఈ వార్త చూశావా?” చేతిలో ఉన్న దినపత్రికలోకే చూస్తూ భార్యనుద్దేశించి అన్నాడు రామారావు.

జవాబివ్వలేదు కమల కోపంతో కుతుకుతలాడిపోతోంది ఒళ్ళు.

“డబ్బు కోసం కన్న బిడ్డనే అమ్ముకుందిట ఓ మహాతల్లి....” అంటూ దినపత్రికలో వార్త చదివి వినిపించాడు.

“మహాతల్లి అంటూ అంత ఈ సడింపుదేనికి? డబ్బు విలువ తెలిసిన మహానుభావురాలనండి” చురకఅంటించాననుకుని తృప్తిపడింది కమల.

“అంతాకలి కాలం మహత్తు... కన్న మమకారాన్ని కూడా చంపేస్తోంది డబ్బు కాపీనం....”

మూతి మూడు వంకర్లు తిప్పి అక్కడినించి లేచి వంటింట్లోకి వెళ్ళిపోయింది కమల.

★★ ★★ ★★

“ఇవాళ సెలవు పెట్టడానికి వీలవదు బావా”

“ఏం? ఎందుక్కుదరదు?”

“ఈరోజు పిల్లల్ని ఎక్స్‌కర్షన్‌కి తీసికెళ్తున్నాం నాతోకలిపి నలుగురు టీచర్లని ఆద్యూటీలో వేశారు. ఇప్పటికిప్పుడు నేను రానని సెలవు పెట్టేస్తే హెచ్.ఎమ్. ఊరుకుంటారా? పైగా అంతమంది పిల్లలకి ముగ్గురే కాపలా అవుతారు.”

“నలుగురి బదులు ముగ్గురైనంత మాత్రాన కొంపలేం మునిగిపోవులే. మళ్ళీ ఏనెల్లాళ్ళకోగానీ రానుకదా నేను? ఆఫీసుపనిమీద నెలకోసారి ఊరొస్తున్నాను కాబట్టి... ఏదో..ఓ రోజునీతో సరదాగా గడిపివెళ్ళడానికి వీలవుతోంది... చూడండి కుమారి లతాదేవిగారూ... ఇవాళ తమరు సెలవు పెట్టి నాతోగడిపితే రాబోయే తమరిపుట్టిన రోజుకి నూటపదహార్లు బహుమతి ఇస్తాను.” “నిజంగానా?

నిజమాబావా?" లతాదేవి కళ్ళు మిలమిలలాడాయి. "అయితే సరే.... నాకు హఠాత్తుగా విపరీతమైన కడుపు నెప్పొచ్చిబాధపడుతుండటం వల్ల ఇవాళ సెలవు పెట్టేస్తున్నానని హెచ్.ఎమ్.గారికి కబురు చేస్తాను..."

★★ ★★ ★★

"నాకేవిటో భయంగా ఉంది... అసలే ఇంతమంది పిల్లల్ని మేనేజ్ చెయ్యడానికి మన నలుగుర్నే పంపిస్తున్నారని నేననుకుంటుంటే... అందులో ఒకళ్ళు.. ఆ లతాదేవిరానే లేదు" హిస్టరీ టీచర్ అరుణ మెల్లిగా నసిగింది పిల్లలందరూ బస్సెక్కాక తను కూడా ఎక్కుతూ.

"నీకన్నీ భయాలే... ఎవరికే అవసరం వొచ్చినా ఫస్టుఎయిడ్ చెయ్యడానికి సత్యమూర్తి ఉండగా భయందేనికి?" ఓరగా పి.టి.మాస్టర్. సత్యమూర్తి వంక చూసినవ్వుతూ అంది వనజ వాళ్ళిదరి మధ్యా ప్రేమాయణం నడుస్తోందని అరుణకి తెలుసు.

వనజకీ అరుణకీ అస్సలు పడదు. ఒకళ్ళు ఎడ్డెవంటే మరొకళ్ళు తెడ్డెవంటారు. వనజ స్కూల్లో కొత్తగా చేరింది సైన్సు టీచర్‌గా వనజ వెళ్ళి వెనక సీట్లో సత్యమూర్తికి కొంచెందగ్గర్లో కూర్చుంది. పళ్ళునూరుకుంటూ అరుణ వెళ్ళి ముందు సీట్లో కూర్చుంది. డ్రైవర్ వెనకవైపు.

బస్సు ఓ ఇరవై మైళ్ళు వెళ్ళాక సత్యమూర్తి అన్నాడు "ఇక్కడినించి అడ్డదోవన వెళ్తే మనం చేరాల్సినచోటు అయిదారు ఫర్లాంగులుంటుందంతే. కానీ ఆరూట్‌లో బస్సువెళ్ళలేదు. నడిచేవెళ్ళాలి.... ఆ పొలాలూ తోటలూ... ఆ కాలవగట్లంటానడుస్తుంటే చాలా బావుంటుంది."

"అయితే అందరందిగి అడ్డదోవన నడిచి వెళ్దాం... అలాం టిరూట్లో నీతో కబుర్లు చెప్తూనడుస్తూ నాముచ్చట తీర్చుకోవాలనుంది"

"పిల్లలు నడవగలరోలేదో" అనుమానంగా చూశాడు. "మరేంపర్వాలేదు... నడుస్తారు... వాళ్ళకీ ఉంటుంది సరదానే నడుగుతానుగా"

పిల్లలంతా కూడా కాలవగట్లంట నడుస్తామని సంబరపడ్డారు. "ఇది రూల్స్‌కి వ్యతిరేకం అవుతుందేమో వనజా! పిల్లల్ని బస్సులో తీసికెళ్తాం అన్నాం గానీ నడిపించి తీసికెళ్తామన్లేదు కదా! ఆ అడ్డదోవ ఎలా ఉంటుందో ఏమో?" భయపడింది అరుణ.

"పిల్లలు నడవగలం అంటుంటే మధ్యన నీకెందుకూ బాధ? అసలైనా... ఓసరదా పాడులేని వాళ్ళు తగుదునమ్మా అంటూరావడం దేనికో?"

వనజమాటలకిచచ్చేంత కోపం వొచ్చింది అరుణకి "మీరంతా నడిచి వెళ్తే వెళ్ళండి నేను నడవలేను. బస్సులోనే వొస్తాను"

"మరీ మంచిది" సణుక్కుంటూ.. పిల్లలంతా దిగాకసత్యమూర్తితో కలిసి బస్సుదిగింది వనజ.

బస్సు ముందుకి కదిలిపోయింది.

వనజా, సత్యమూర్తీ ఒకరికళ్ళల్లోకి ఒకరు చూసుకుంటూ ప్రేమలోకంలో తేలిపోతూ నడుస్తున్నారు ఇతరప్రపంచంతో సంబంధమేలేనట్టు.

పిల్లలందరూ ఇద్దరూ ముగ్గురూగా విడిపోయి ఎవరి గోలలో వాళ్ళు కేరింతలు కొడుతూనవ్వుతూ, తుళ్ళుతూ పరుగులు పెడుతున్నారు ముందుకి.

ఒక గ్రూప్‌కీ మరోగ్రూప్‌కీ సంబంధమేలేనట్టు దూరాలు పెరిగాయి వాళ్ళ మధ్య.

ఓ ఇరవైనిమిషాలు గడిచి ఉంటుంది....

స్నేహితుడు అజయ్‌కి సినిమా కథేదో చెప్తూ... ఆసినిమాలో హీరోలాగే గంతులేస్తూ... కాలవ గట్టుమీదే చిందులేస్తూ వొస్తున్న గోపీకాలు జారిపడిపోయాడు. కాలవలో భయంతో.. షాక్ తగిలినట్టయి నోట్లోంచి మాటేరాలేదు అజయ్‌కి. అరిచాననుకున్నాడు. కానీ, అసలు శబ్దమే రాలేదు నోట్లోంచి కాసేపటికి గానీ తేరుకోలేకపోయాడు. అప్పుడు చూశాడు వెనక్కి తలతిప్పి. బాగాదూరంలో.... ఓ చెట్టుకింద, ఆగిపోయి కబుర్లు చెప్పుకుంటున్న పి.టి.సార్, వనజ టీచర్ కనిపించారు.

"టీచర్... టీచర్.." చేతులూపుతూ గట్టిగా అరిచిపిలిచాడు. టీచర్లిద్దరూ... అజయ్ అరుపువినపడి తిరిగి చూశారుగానీ.. మళ్ళీ వెంటనే తలలు తిప్పేసుకున్నారు.

"ఈ పిల్లలకి ఏం చూసినా వింతలూ విడ్డూరాలుగానే ఉంటాయి. అవి మనక్కూడా వింతే అనుకుంటారువాళ్ళు. అందుకే పిలుస్తున్నట్టున్నాడు. అది సరే గానీ సత్యమూర్తీ మావాళ్ళతో ఎప్పుడు మాట్లాడతావు? ఎన్నాళ్ళిలా పోస్టుపోన్ చేస్తావు మనపెళ్ళి విషయం?....." సీరియస్‌గా అడిగింది వనజ.

"అంతతొందరైతే ఎలా వనజా? ముందు మా చెల్లెలికి సంబంధం కుదరాలి కదా?"

"అంటే? మీ చెల్లెలికి పెళ్ళయ్యే వరకూ మనపెళ్ళి వాయిదా వెయ్యాల్సిం దేనా?" కోపం చిందులేసింది ఆకళ్ళల్లో ఇద్దరూ వాదనలోకి దిగారు పిల్లల విషయమే మర్చిపోయి. "ఏవిట్రా.. అలా అరుస్తున్నావు? ఏవుందక్కడ?" అప్పుడే అజయ్ ఉన్న చోటకి చేరుకున్న శ్రీనివాస్ బృందం అడిగారు అజయ్‌ని ఆమాటతో.... ఒక్కసారిగా గట్టిగా ఏడుపు మొదలుపెట్టాడు అజయ్.

చేత్తో కాలవ వైపు చూపించాడు.

"మరి...గోపీ...కాలవలోపడిపోయాడు..." చెప్పేసి మళ్ళీ ఏడుపు మొదలుపెట్టాడు.

"ఆ... అయ్య బాబోయ్...."

"సార్... తొందరగా రండి సార్.... తొందరగారండి..." పి.టి. సార్ని ఉద్దేశించి గట్టిగా అరిచాడు శ్రీనివాస్ ఉహూ... సార్ కదుల్తున్న సూచనలు కనిపించలేదు. తనేపరిగెత్తు కుంటూ ఆయాసంతోరొప్పుకుంటూ చేరుకున్నాడు సార్ని.

"ఎందుకూ చెవి కోసిన మేకల్లా అరుస్తున్నారిందా కట్నించీ?" కస్సుమంది వనజ శ్రీనివాస్‌ని చూస్తూనే.

సత్యమూర్తి మీది కోపాన్ని ఆపిల్లాడి మీద చూపించుకుంది. ఏడుపు మొహంపెట్టాడు. శ్రీనివాస్. "మరేమో టీచర్...మరి... మరి... గోపి కాలవలో పడిపోయాడు..."

★★ ★★ ★★

పి.టి.సార్ కాలవలో దూకి... వెతికి... గోపీని ఇవతలికి తీసినా.. ఫస్టు ఎయిడ్ చేసినా ప్రయోజనం కనిపించలేదు. అప్పటికే కొంత ఆలస్యమైపోయింది. ఊపిరి అందని ఆపిల్లాడిని వెంటనే హాస్పిటల్‌కి తరలించడానికి బస్సేది?... దగ్గిర్లో హాస్పిటల్ ఏదీ? పొలాల్లో తోటల్లో హాస్పిటల్ ఎక్కడుంటుంది? నూరేళ్ళు నిండిపోయాయి గోపీకి.

★★ ★★ ★★

కన్నతండ్రే కాక... స్కూల్ మొత్తం విషాదంలో మునిగిపోయిందా వార్త తెలిశాక.

రామారావు కుటుంబంతో తనకి పరిచయం ఉండడం వల్ల... బస్సునిపపించేసి... పిల్లల్ని అడ్డదోవన కాలవగట్లంట నడిపిస్తూ నిర్లక్ష్యంగా వొదిలేయడం గురించి... ఆ తర్వాత పిల్లలు చెప్పిన కథనం.. అన్నీ వివరంగా రామారావుతో చెప్పి... వనజ మీద తనకున్న కోపాన్నీ కసినీ తీర్చుకుంది అరుణ.

కోపంతో ఊగిపోయాడు రామారావు. "తప్పకుండా కేసుపెడతాన్నేను స్కూల్ వాళ్ళమీద... ఆకోర్టే అన్ని విషయాలూ వాకబు చేస్తుంది."

రామారావు ఉద్దేశం తెలిసి... ఆఘమేఘాలమీద వొచ్చిపడ్డాడు హెచ్.ఎమ్.

"చూడండి... మీ అబ్బాయి అకాలమృత్యువుకి గురికావటం మనందరి దురదృష్టం. ఈ కడుపు కోత భరించటం ఎంత కష్టమో నేనూహించుకోగలను. మేమందరంకూడా ఎంత దుఃఖిస్తున్నామో... ఎంత బాధపడుతున్నామో మాటల్లో చెప్పలేను.. కానీ... కానీ... నామనవి ఆలకించమని మిమ్మల్ని రిక్వెస్టు చెయ్యడాని కొచ్చాను... మీరు కోర్టుకి వెళ్తే మా స్కూల్‌కి చెడ్డపేరొస్తుంది.. ఎక్కడెక్కడి వాళ్ళకీ...

తెలియనివాళ్ళందరికీ కూడా ఈ వార్త తెలుస్తుంది...ఒకసారి స్కూల్‌కి చెడ్డ పేరొచ్చిందంటే ఎంత కష్టమో ఆలోచించండి. ముందు ముందు ఎవరూ వాళ్ళ పిల్లల్ని మా స్కూల్లో చేర్చడానికిష్టపడరు... ఇవి చేతులు కావు.. మీ కాళ్ళే అనుకోండి.. దయచేసి కోర్టుకి వెళ్ళకండి.. మీ అబ్బాయి ప్రాణానికి విలువకడుతున్నానని అనుకోకండి. ఈ డబ్బుంచండి..." తను తెచ్చిన నోట్లకట్టలు లెదర్ బ్యాగ్‌లోంచి తీసి రామారావు చేతుల్లో పెట్టాడు. హెచ్.ఎమ్. "క్షమించండి. కొడుకు చావు మీద డబ్బు చేసుకోవాలని నేనను కోవట్లేదు..." చురుక్కుమనేలా చూశాడు రామారావు. "అదికాదండీ... మీరు మరోలా అనుకోవద్దు..." బతిమాలడం మొదలెట్టాడు హెచ్.ఎమ్.

"ఏమండీ.. ఓ సారిలా లోపలికి రండి..." భార్యపిలుపువిని వంటింట్లోకి నడిచాడు రామారావు.

"ఆ డబ్బు తీసుకోండి కేసుపెట్టనని చెప్పండాయనతో..."

"కమలా!"

"ఔనండీ.. కేసుపెట్టినంత మాత్రంలో పోయిన మీ పిల్లాడి ప్రాణం తిరిగొస్తుందా?"

"రాదు నిజమే.. కానీ.. రూల్స్ ప్రకారం నడుచుకోకపోతే... పిల్లల్ని మరింత శ్రద్ధంగా వేయికళ్ళతో కాచిచూచుకోక పోతే... ఎంత పెద్దనష్టం వాటిల్లుతుందో తెలిసి మరింత జాగ్రత్తగా ఉంటారు అందరు టీచర్లూ... అన్ని స్కూళ్ళ వాళ్ళూ కూడా... జరిగినసంఘటనలూ... నిజానిజాలూ... కారణాలూ అన్నీ అందరికీ తెలియాలంటే కేసు పెట్టాలి..."

"చాల్లెండి కబుర్లు.. మీరేదోగుణ పాఠం నేర్పెయ్యాలని అనుకోకండి... ఏ టీచర్లెంత శ్రద్ధగా ఉంటే మీకెందుకూ? ఏ స్కూల్ వాళ్ళెంత జాగ్రత్తగా నడుచుకుంటే. మీ కెందుకూ? దానివల్ల ఇంక మీదట మీకు ఒరిగేదేవీ లేదు. పోయిన మీ పిల్లాడు తిరిగిరాడు.. వొస్తున్న డబ్బు వొదులుకుంటారా తెలివి తక్కువగా!"

"చాలా అన్యాయంగా మాట్లాడుతున్నావు కమలా! ముందుముందు మరోసారెప్పుడూ ఇలాంటి ఘోరం జరగకుండా... ఇలాంటి పొరపాట్లు జరగకుండా..."

"ఆ తెలివి తక్కువేవొద్దంటున్నాను.. దానివల్ల మీ కొచ్చేదేవీ లేదు... మీరింత తెలివి తక్కువగా ప్రవర్తిస్తే మీతో నేనుకాపరం చెయ్యలేను. రేపే మాపుట్టింటికి పోతాను... నాకో గాజులజత చేయించమని ఎన్నాళ్ళ బట్టో అడుగుతున్నాను మిమ్మల్ని ఎప్పుడూ డబ్బు లేదన్న జవాబేగా? వొస్తున్న లక్ష్మిని ఆహ్వానించడం తెలియదు... చేతులడ్డు పెట్టడం ఒక్కటే తెల్సు.. ఏవైనా సరే! మీతో కాపరం నావల్ల కాదు. రేపో మాపో పుట్టింటికి నేపోవడం ఖాయం." కళ్ళు తుడుచుకుంటూ విసురుగా పెరట్లోకి వెళ్ళిపోయింది కమల రామారావు కళ్ళల్లో కూడా నీళ్ళు తిరిగాయి. ఎటొచ్చీ అతని కళ్ళు కన్నీరు చిందించడానికీ, కమల కంటతడిపెట్టడానికీ కారణాలు మాత్రం వేరు.

తండ్రికి జరగబోయే ఆపరేషన్‌కి డబ్బు సద్దుబాటు చెయ్యాలి. భార్యకి గాజుల జత చేయించాలి... పక్కవీథిలో చౌకలో అమ్మకాని కొచ్చిన స్థలం వొదులుకోకూడదు.. ఎలాగో అలా కొనాలి.. జీవితావసరాలతో పోరాటం తప్పదు.... గుండెని... ఒక్కోసమయంలో బండరాయిగా మార్చు కోకాతప్పదు. నీరసంగా.. అడుగులో అడుగువేస్తూ ముందుగదిలో కొచ్చి... హెడ్. మాస్టారి ఎదురుగా నిలబడి... చేయి చాపాడు రామారావు, మనసు చంపుకుని.

★★ ★★ ★★